క్లుప్తంగా

28న సైన్స్ మేళా

కమలాపూర్ : ఈనెల 28వ తేదీన ప్రఖ్యాత సైన్స్ శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని (సైన్స్ డే) పురస్కరించుకుని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం ఎం.రాజమల్లయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక, కేజీబీవీ, తెలంగాణ మోడల్ స్కూళ్లలో ఒకటి నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక ప్రగతిపై ఆసక్తి కలిగించేందుకు, వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఈఓ, ఎంఈఓ తదితరులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వేలేరు : మండలంలోని మద్దెలగూడెం గ్రామంలో బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్న పోగుల రాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై హరిత మంగళవారం ప్రకటనలో తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రూ.4650 విలువ గల బీర్లు, మద్యం బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా ఆమె వెల్లడించారు.

రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జగన్ మోహన్‌రావు ఎన్నిక

హన్మకొండ అర్బన్ : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు మంగళవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లా టీజీఓ అసోసియేషన్ కో–ఆర్డినేటర్‌గా, సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ హోదాలో పని చేస్తూ తెలంగాణ సహకార శాఖ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఎంప్లాయిస్ జేఏసీ మాజీ చైర్మన్ పరిటాల సుబ్బారావు, టీజీఓ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, కారం రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కిరణ్‌కుమార్ గౌడ్, కోలా రాజేష్ తదితరులు అభినందించారు.

కాంగ్రెస్‌లో ఎన్‌ఆర్‌ఐ చేరిక



న్యూశాయంపేట : తెలంగాణ ఉద్యమకారుడు వరంగల్ నగరానికి చెందిన బీఆర్‌ఎస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ సీనియర్ నాయకుడు ఎంఏ.ఖలీల్ హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వరంగల్ నగరంలో జలీల్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థను ఏర్పాటు చేసి పాఠశాల విద్యార్థులకు ఆర్థికసాయం అందిస్తున్నారు. బీఆర్‌ఎస్ మైనారిటీలకు ఇచ్చిన హామీలను విస్మరించడంతో కలత చెందిన ఆయన కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

బీజేపీ విజయ సంకల్పయాత్ర

హన్మకొండ: బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విజయసంకల్ప యాత్రలో భాగంగా ఈ నెల 29, మార్చి 1వ తేదీల్లో వరంగల్, భూపాలపల్లి, ములుగు, హనుమకొండ జిల్లాల్లో పర్యటన సాగనుంది. రాష్ట్రంలోని అన్ని లోక్‌సభ నియోజకవర్గాల్లో యాత్ర కొనసాగేలా పార్టీ తేదీలను ఖరారు చేసింది. రాష్ట్రాన్ని అయిదు జోన్‌లుగా విభజించి మంగళవారం యాత్ర చేపట్టారు. ఈనెల 29న నర్సంపేట, నల్లబెల్లి, ములుగు, మల్లంపల్లి, జాకారం, భూపాలపల్లి, రేగొండ, పరకాలలో జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. మార్చి 1న పరకాల, ఆత్మకూరు, వరంగల్ వెంకట్రామ జంక్షన్, స్టేషన్‌రోడ్, పోచమ్మ మైదాన్, హనుమకొండ చౌరస్తా, మీదుగా మడికొండ వరకు యాత్ర సాగనుంది.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా పవన్

హన్మకొండ చౌరస్తా: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా హనుమకొండలోని అడ్వకేట్స్ కాలనీకి చెందిన తోట పవన్‌ను నియమిస్తూ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ ప్రజాభవన్‌లో మంగళవారం పవన్ నియామక ఉత్తర్వులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని, యూత్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్, అలువాల కార్తీక, పల్లె రాహుల్‌రెడ్డిలకు ఈ సందర్భంగా పవన్ కృతజ్ఞతలు తెలిపారు.

దళితమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా మహేందర్

మడికొండ: బీజేపీ దళితమోర్చా రాష్ట్ర అధి కార ప్రతినిధిగా కాజీ పేట మండలం మడికొండకు చెందిన గడ్డం మహేందర్‌ను మంగళవారం నియమించినట్లు బీజేపీ దళిత మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటీ శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధికార ప్రతినిధిగా అవకాశం కల్పించిన కొండేటీ శ్రీధర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌కు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మకు, నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మినీ జాతరల నిర్వహణకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నేడు సారలమ్మ ఆగమనం
- వేలాదిగా తరలిరానున్న భక్తులు



కమలాపూర్ : ముస్తాబైన సమ్మక్క-సారలమ్మ జాతర ప్రాంగణం

ఎల్కతుర్తి : సమ్మక్క–సారలమ్మ మినీ జాతరల నిర్వహణకు అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని దామెర గ్రామంలోని జాతర ప్రాంగణాన్ని డోజర్‌తో శుభ్రం చేయించారు. అలాగే ముళ్లపొదలను జేసీబీ సహాయంతో తొలగించారు. నేడు సారలమ్మ గద్దెకు చేరుకోవడంతో జాతర ప్రారంభం కానుంది. గద్దెల చుట్టూ జీపీ సిబ్బంది పెన్సింగ్ ఏర్పాటు చేశారు. విద్యుత్, తాగునీటి, ఇతర సదుపాయాలను జాతర కమిటీ చైర్మన్ ఠాగూర్ రామ్‌సింగ్ పర్యవేక్షణలో పూర్తి అయ్యాయి. కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి, ఆదామ్, వెంకన్న, కమురోద్దీన్, రవి, వెంకటేశ్వర్లు, సదయ్య, ధనుంజయ్, సమ్మయ్య, రాజు, నరేందర్, సుధాకర్, భగవాన్‌గౌడ్, పూజారి మద్యభూమయ్య పనులను పరిశీలించారు.

భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారు జోగంపల్లిలో నిర్వహించే మినీ సమ్మక్క–సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తహసీల్దార్ సుభాషిణి వైద్య సిబ్బందికి సూచించారు. జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని మంగళవారం ఆమె సందర్శించి వైద్య పరీక్షలు చేసుకున్నారు. జాతర జరిగే సమయంలో భక్తులకు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ అబ్బు ప్రకాశ్‌రెడ్డితో మాట్లాడారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అనంతరం అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మినీ జాతరకు ఏర్పాట్లు పూర్తి

కమలాపూర్ : నేటి నుంచి 24వ తేదీ వరకు మండల కేంద్రంతో పాటు కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో జరుగనున్న సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహణ పనులను ఉత్సవ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. జాతర జరిగే ప్రాంతాలను ఇప్పటికే చదును చేసి సమ్మక్క–సారలమ్మ గద్దెలను రంగులతో అలంకరించి, జాతర ప్రదేశాల వద్ద దకాణాలు, జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, విద్యుత్ వసతితో పాటు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఎండ వేడిమి దృష్ట్యా భక్తుల నీడ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు ఆయా గ్రామాల జాతర ఉత్సవ కమిటీ చైర్మన్లు, సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం పసుపు, కుంకుమతో పాటు కంకవనం తీసుకెళ్తామని, సాయంత్రం సారలమ్మ గద్దెకు వస్తుందని, 22న సాయంత్రం సమ్మక్క గద్దెకు వస్తుందని, 23న భక్తులు మొక్కులు చెల్లించుకుంటారని, 24న సమ్మక్క–సారలమ్మ వన ప్రవేశంతో జాతర ముగుస్తుందని సమ్మక్క జాతర ఉత్సవ కమిటీ చైర్మన్లు, సభ్యులు తెలిపారు.



ఎల్కతుర్తి : దామెరలో ఏర్పాట్లు చేస్తున్న జీపీ సిబ్బంది



వేలేరు : ఉత్సవ కమిటీకి సూచనలు చేస్తున్న ఎస్సై

వేలేరులో..

వేలేరు : పీచర, ఎర్రబెల్లి గ్రామాల్లో జరిగే సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎస్సై డి.హరిత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వనదేవతల దర్శనానికి వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఉత్సవ కమిటీలకు సూచించారు. జాతర సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. చట్టాన్ని ఉల్లంఘించొద్దని హెచ్చరించారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఇప్పటికే బీఆర్‌ఎస్ డీలా పడింది
- కాంగ్రెస్‌కు బీజేపీ పోటీ కానేకాదు
- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

పరకాల : రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరకాల పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో పరకాల పట్టణం, పరకాల, నడికూడ మండలాల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు భేదాభిప్రాయాలు వీడి సమన్వయంతో పనిచేయాలన్నారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలు, నాయకులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, అవినీతికి పాల్పడే ఎంతటి వారినైనా సహించేది లేదని హెచ్చరించారు. తప్పనిసరిగా ఆరు గ్యారంటీలను సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అమలు చేస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ డీలా పడిందని, బీజేపీ తమకు పోటీ కానేకాదని జోస్యం చెప్పారు. కాగా, పరకాలలో శిథిలావస్థకు చేరిన శాఖా గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. పునరుద్ధరించి, పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని లైబ్రేరియన్ విశ్వనాథ్, స్థానికులు ఆయనను కోరగా సానుకూలంగా స్పందించారు.

ఎమ్మెల్యే పరామర్శ

నడికూడ : మండలంలోని రాయపర్తికి చెందిన కండె పద్మ ఇల్లు ఇటీవల ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, బుర్ర దేవేందర్, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మొగిలి

శాయంపేట : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతులను చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాయరాకుల మొగిలి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం గావ్‌చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యకార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి బీజేపీ అత్యధిక సీట్లు గెలిచే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గడ్డం రమేష్, మండల ప్రధానకార్యదర్శి ఉప్పు రాజు, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు కానుగల నాగారాజు, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు చంద్రమౌళి పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యక్తిత్వవికాసం అభివృద్ధి చెందాలి



మాట్లాడుతున్న చైల్డ్‌వెల్ఫేర్ సభ్యుడు దామోదర్

వేలేరు : విద్యార్థుల వ్యక్తిత్వవికాసం అభివృద్ధి చెందాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో పదోతరగతి, ఇంటర్ విద్యార్థులకు వ్యక్తిత్వవికాసం, పలు అంశాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిత్వ వికాస పరీక్షలతో విద్యార్థులు ఒత్తిడి నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం సీడబ్ల్యూసీ పర్యవేక్షకుడు హరీష్ మాట్లాడుతూ.. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికావద్దని, సిలబస్ క్రమపద్ధతిలో చదువుకోవాలని సూచించారు. ఇష్టంతో పాటు కష్టపడి చదివితే విజయం మీ సొంతం అవుతుందన్నారు. ప్రతి విద్యార్థి చదువులో పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అనిత, ఎస్‌ఓ స్రవంతి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లు

ఐనవోలు : మండలంలోని కూనూరు గ్రామశివారు ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను వనమాలకనపర్తి గ్రామ శివారులో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ఆకేరు వాగు పరివాహక ప్రాంతల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తోడి ట్రాక్టర్ల ద్వారా వరంగల్ నగరానికి రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో వనమాలకనపర్తి గ్రామ శివారులో ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు పట్టుబడినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రావాణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్కతుర్తిలో టిప్పర్ సీజ్

ఎల్కతుర్తి : హుజూరాబాద్ నుంచి వంగరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. టిప్పర్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఓనర్ రాకేష్, డ్రైవర్ శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు జరిగే శ్రీసత్యబామ రుక్మిణి సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రంగాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు నర్సింహాచార్యులు, భాస్కరాచార్యులు, భగవాన్, రంగనాథచార్యులు, మురళీకృష్ణ నిత్యపూజ, హోమం, బలిహారణం నిర్వహించి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా జరిపించారు. సాయంత్రం నిత్యపూజ, నిత్యహోమం, బలిహరణం, ఆరగింపు, హారతి, తీర్థప్రసాద వితరణ చేసి వేడుకలు నిర్వహించారు. అదే విధంగా మహాఅన్నదాన కార్యక్రమం చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ధర్మకర్తలు రావుల రాఘవరెడ్డి, రావుల వెంకట్‌రెడ్డి, దేవాలయ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో లోపించిన నాణ్యత



మహిళా కమిటీ భవనం పగుళ్లను చూపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నడికూడ : మండల కేంద్రంలో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనం, మహిళా కమిటీ భవన నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నూతన గ్రామపంచాయతీ ఆవరణంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. భవనాలు నిర్మించిన కొన్ని నెలలకే పగుళ్లు తేళాయని అన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయ్యిందని ఆరోపించారు. ఉన్నతాధికారులు పట్టించుకొని నూతన గ్రామపంచాయతీ భవనం, మహిళ కమిటీ భవనాలను నిర్మించిన కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్ల నవీన్, రాజేశ్వరరావు, బొమ్మ చంద్రమౌళి, వాంకె రాజయ్య, నారగాని కుమారస్వామి, అట్టెం బాబు, నవీన్, దుప్పటి క్రిస్టఫర్, తాళ్లపల్లి యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

వేలేరు : మండలంలోని 14 గ్రామపంచాయతీల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ముందుగా ఉపాధిహామీ పనులపై గత పదిరోజులుగా గ్రామాల్లో సర్వేచేసిన నివేదికను చదివి వినిపించారు. జాబ్ కార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించకపోవడంతో టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.5,400, వివిధ గ్రామాల పంచాయతీకార్యదర్శిలకు రూ.500 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సమ్మిరెడ్డి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, శ్రీనివాస్, నరసింహరెడ్డి, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఫ్లెక్సీల ఏర్పాటు



మాందారిపేట స్టేజీ వద్ద ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీ

శాయంపేట : మేడారం జాతర సందర్భంగా ప్రమాదాలను నివారించేందుకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రధానకూడళ్లు, మలుపుల వద్ద సూచికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లే భక్తులు సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు తెలియజేస్తూ ఫ్లెక్సీలను, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. అతివేగంతో వెళ్లే వాహనాలను గుర్తించేందుకు మాందారిపేట స్టేజి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

మంత్రి ప్రభాకర్‌కు ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చైర్మన్

కమలాపూర్ : ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు మండలంలోని కన్నూరు గ్రామంలో జరిగే మినీ సమ్మక్క–సారలమ్మ జాతరకు రావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కన్నూరు సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్ నల్లాని సురేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి మంగళవారం ఆహ్వాన పత్రిక అందించారు. ఈ సందర్భంగా కమలాపూర్, కన్నూరు, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం గ్రామాల్లో జరిగే మినీ జాతర ప్రాంగణాల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించాలని మంత్రిని కోరారు. స్పందించిన ఆయన విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు జాతర ప్రాంగణాల వద్ద విద్యుత్ సౌకర్యం కల్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, హుజూరాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భిక్షపతి, శివకృష్ణగౌడ్, కొంరయ్య పాల్గొన్నారు.

బీజేపీ సంస్థాగత నియామకాలు

కమలాపూర్ : బీజేపీ మండల సంస్థాగత నియామకాలు చేపట్టినట్లు ఆపార్టీ మండల అధ్యక్షుడు కట్కూరి అశోక్‌రెడ్డి తెలిపారు. మండల ఉపాధ్యక్షుడిగా పంజాల సారయ్య, మండల కార్యదర్శులుగా నరేష్, కనుకుంట్ల అరవింద్, బైరి రాజేశ్, పిట్టల సతీష్, గొర్రె మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా ఐరెడ్డి దేవేందర్‌రెడ్డిని నియమించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు ఆదేశానుసారం నియామకాలు చేశామన్నారు.

‘వయ్యారిభామ’ పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

నడికూడ : రైతులు వయ్యారిభామ కలుపుమొక్కపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థినులు సూచించారు. గ్రామీణ అవగాహన, కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో రైతులకు వయ్యారిభామ కలుపుమొక్కపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మొక్కను ఎరువుగా మలుచుకునే పద్ధతిపై రైతులకు వివరించారు. వయ్యారిభామ కలుపుమొక్క వలన మనుషులకు, పశువులకు, మొక్కలకు ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. పంటలో నీరు, పోషకాలతో ఈ మొక్క పోటీ పడి 40 శాతం వరకు దిగుబడులు తగ్గించేందుకు కారణమవుతుందని అన్నారు. పూతకురాని వయ్యారిభామ మొక్కలను ఉపయోగించి సేంద్రియ ఎరువును తయారు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, భవాని, శ్రేయ, సింధు, గాయత్రి, జ్యోత్స్న, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు మహిళ అప్పగింత

ఐనవోలు : మతిస్థిమితం సరిగాలేక తప్పిపోయిన మహిళను గ్రామస్తులు చేరదీసి పోలీస్‌లకు అప్పగించారు. ఎస్సై అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖిలా వరంగల్‌కు చెందిన మేకల ఎలిషా కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేక తప్పిపోయింది. మంగళవారం మండలంలోని ములకలగూడెం గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు చేరదీసి స్థానిక పోలీసులకు సమాచారం అందించగా కానిస్టేబుల్ రాకేష్ ఆమె వివరాలు సేకరించారు. ఎలిషా కుటుంబ సభ్యులకు సమాచారం అందించి గ్రామస్తుల సమక్షంలో ఎలిషాను కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో గ్రామస్తులకు ఆమె కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం



ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో గల చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం శ్రీదేవిభూదేవిసమేత చెన్నకేశవస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. చిట్టిబొమ్మల భిక్షపతి దంపతులు మహాఅన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి , కడారి రఘునాథరావు, చిదిరాల సుధాకర్‌రెడ్డి, ఆలయకమిటీ చైర్మన్ తాడిపర్తి మోహన్‌రావు, మాజీ సర్పంచ్‌లు అర్షం బలరాం, ఉడుత మహేందర్, మానగాని శంకర్ పాల్గొన్నారు.